# అపార్థం

ముచ్చటగా ముస్తాబై, మంద మందంగా తప్పటడుగులు వేసుకుంటూ, బైటికి వచ్చిన బాబుని ప్రక్కింటి రమ ముచ్చటపడి దగ్గరికి తీసుకుంది "బువ్వ తిన్నావా బాబూ?" మందహాసంతో ప్రశ్నించింది రమ

"ఊ" అనిమాత్రం అన్నాడు బాబు.

"ఈ బట్టలు నాకు యిస్తావా?" నవ్వుతూ అడిగింది రమ అతడు వేసుకున్న రంగు రంగుల బుష్‌షర్టు చూపిస్తూ.

బాబు తల అడ్డంగా ఆడించాడు.

అంతలోనే బాబు తల్లి జానకి అబ్బాయి కోసం వెదుకుతూ బైటికి వచ్చింది. తృప్తిగా నవ్వుతుంది.

"వీడికోసం యిల్లంతా గాలించేస్తున్నానండీ" అంది జానకి.

"ఇప్పుడే బైటికి వచ్చాడులెండి. ఈ బట్టలిస్తావా అని అడిగితే యేమీ చెప్పడు. ఇవ్వనని వుద్దేశం గాబోసు. వయసులో చిన్నవాడయినా వూహాలు పెద్దవే" అంది రమ మందహాసంతో.

కొడుకుగురించి రమ చెప్తూవుంటే జానకి మురిసిపో యింది. మాతృహృదయం మరి!

“ఈ బట్టలు మొన్ననే వీళ్ళ పిన్ని పంపిందండీ ఈ ఒక్కజత పదిరూపాయిలట. పిల్లలకి అంతఖరీదుబట్టలు ఎందుకే అంటే, అది వినిపించుకోదు” అంది జానకి. “డబ్బు పోతే పోయిందిగాని బట్టలు చాలా బావున్నాయండీ! బాబుని మరీ ఆకర్షణీయంగా తయారు చేశాయి” అంది రమ.

రమ అనడం సదుద్దేశంతోనే అంది. అవుతే అంత వరకు ఆనందంగా వున్న జానకికి మాత్రంపై మాటలు మరోలా స్ఫురించాయి. బాబుని చూచి రమ అసూయపడుతుందేమో నన్న అనుమానం ఆమెలో పొడ చూపింది. ఇటీవల బాబుకి తను మంచిమంచి దుస్తులు వేస్తుండటం వాడు చురుగ్గా తిరగడం యివన్నీ చూసి రమ కళ్ళు పొడుచుకుంటుందేమో నన్న భావనకు మనసులో ఓచోట తావిచ్చింది జానకి. ఆక్షణం నుంచి ఆమె ముఖకవళికలు మారిపోయాయి “డబ్బునుబట్టే బట్టలూ వుంటాయి కదండీ. మరి వస్తానండీ. చాలా పనుంది...” అంటూ బాబును యెత్తుకొని వెళ్ళిపోయింది జానకి.

రమ బాబుకేసి మందహాసంతో చూస్తూ వుండిపో యింది. అతడు కనిపించేవరరకూ, ఆమెకి జానకి ఆంతర్య మెట్లా తెలుస్తుంది పాపం!

*　　*　　*

రమాదేవి డాక్టర్ వేణు భార్య. డాక్టర్ వేణు భార్యను ఎప్పుడూ 'రమా' అనే పిలుస్తూ వుంటాడు. అతను అనతి కాలంలో డాక్టరుగా ప్రజల అభిమానాదరాలు సంపాదించాడు. సంవత్సరంనుండి వీళ్ళు, జానకివాళ్ళ యింటి ప్రక్కనే వుంటున్నారు. అవుతే రమకి ఒక్కటే లోటు సంతానం లేదు. అందుకే పిల్లలంటే ఆమెకి అయిదో ప్రాణం. ఏ పిల్లల్ని చూచినా ఆప్యాయంగా చేరదీస్తుంది.

జానకి భర్త రామ్మూర్తి, అతను అకౌంటెంటుగా పని చేస్తున్నాడు సహజంగా మంచివాడు ఆ దంపతులకు బాబు ఒక్కడే సంతానం. లేక లేక పుట్టినవాడవటంవల్ల, బాబంటే ఆ దంపతులకు పంచప్రాణాలు. బాబుకి కాస్తంత రొంప చేస్తే చాలు, యిద్దరూ ఆతృత పడతారు. వెంటనే డాక్టర్ని తీసుకొచ్చేస్తాడు రామ్మూర్తి. డాక్టర్ వేణు పొరుగుకి వచ్చాక డాక్టరుకోసం వాళ్ళు అధిక శ్రమ తీసుకో నవసరం లేకపోయింది.

* * *

కొద్దిరోజులు గడిచాయి. బాబు అప్పుడప్పుడూ రమ దగ్గరికి వస్తున్నా, ఆ అవకాశాలు సాధ్యమైనంతవరకు తగ్గించడానికి ప్రయత్నించింది జానకి. అవుతేనేం - చిన్నపిల్లల్ని కట్టుదిట్టాల్లో వుంచడం యెవరి తరం?

ఓ రోజు అకస్మాత్తుగా బాబుకి అస్వస్థత చేసింది. జ్వర తీవ్రత క్రమంగా అధికమయింది జానకి మనస్సు వికల మయింది. రామ్మూర్తి కలవరపడ్డాడు. అప్పటికి డాక్టర్ వేణు యింట్లో లేడు. రామ్మూర్తి హాస్పిటల్‌కి వెళ్ళి డాక్టర్ వేణుని తీసుకుని వచ్చాడు.

డా. వేణు బాబుని పరీక్ష చేశాడు. చాలా పరిశీలనగా పరీక్షిస్తున్నాడు.

"ఎలా వుందండీ వేణుగారూ?" ఆత్రంగా అడిగాడు రామ్మూర్తి.

డా. వేణు పరీక్షిస్తుండటంవల్ల రామ్మూర్తి ప్రశ్నను అంతగా పట్టించుకోలేదు. అవుతే, డాక్టరు మౌనం రామ్మూర్తి దంపతులను కలవరపర్చింది. తుపానులాంటి ఆ వేదన, ఆతృత వారిని కదిల్చివేసింది. జానకి లోపలి గది ద్వారం దగ్గర నుంచుని కంట తడిపెట్టుకుంటోంది. మనసులో వేయి దేవు ళ్ళకు మ్రొక్కుకుంటోంది తన బాబుకి యే ప్రమాదమూ లేకుండా చూడమని.

"ఏమిటండీ అలా ఆలోచిస్తున్నారు?" గాభరాగా అన్నాడు రామ్మూర్తి మళ్ళీ.

డా. వేణు యిప్పుడతని ప్రశ్న విన్నాడు. తను ఆలో చనలోపడి చాలా పొరపాటు చేసినట్టుగా భావించాడు. అందుకు పశ్చాత్తాపపడ్డాడు కూడాను.

"అబ్బే! యేమీ లేదండీ! అకారణంగా ఆలోచనల్లో పడ్డాను బాబు విషయంలో మీరేమీ అధైర్యపడకండి." అంటూ ఒక యింజక్షను యిచ్చాడు.

రామమూర్తిగారూ! నాతో మీరు రండి. మందిస్తాను" అంటూ తన వెంట అతణ్ని డిస్పెన్సరీకి తీసుకుపోయాడు డా. వేణు.

బాబుకి బాగులేదని తెలియగానే రమ హృదయం యెందుకో అదోలా కొట్టుకుంది. ఆమెకి బాబంటే యెంతో అభిమానం. ఆ ముచ్చటైన మొహం చూస్తుంటే, అల్లాంటి అబ్బాయి తనకీ ఒకడువుంటే తను యెంత అదృష్టవంతురాలు! అన్న ఆమెలో కలిగే భావనే, బాబుపై ఆమెకు గల మమకారానికి కారణమేమో ననిపిస్తోంది వార్త విన్నవెంటనే బాబునిచూడ్డానికి వచ్చింది.

రమను చూడగానే జానకి మొహం ప్రక్కకి తిప్పుకుని చిట్లించుకుంది. రమ పాడు దృష్టే తన బాబుమీద పడిందని, ఆ విష దృక్కులే తన బాబుని మంచమెక్కించాయనీ, ఒక విధమైన దురభిప్రాయాన్ని యేర్పరచుకుంది. ఆ భావనతో, ఆ అపోహతో రమతో స్వేచ్ఛగా మాట్లాడలేక పోయింద కూడాను. అయితే, రమ మాత్రం జానకిని గురించి తప్పుగా యెప్పుడూ ఊహించలేదు. కొడుకు అస్వస్థత, జానకిలో ఉత్సాహాన్ని క్షీణింపజేసిందని భావించింది.

"వస్తానండీ జానకిగారూ! బాబు గురించి మీరేమీ

అధైర్యపడకండి .... "అంటూ జానకికి ధైర్యంచెప్పి వెళ్ళిపోయింది.

రమ మాటలు జానకికి యే మాత్రం రుచించలేదు. పైగా కోపాన్ని యినుమడింప జేశాయి. రమ లోలోపల కపట భావాలు నిలువజేసుకుని, బాహ్యంగా నటిస్తుందనే భావించింది జానకి.

రెండు - మూడు - నాలుగు దినాలు గడిచాయి. బాబుకి నయం కన్పించలేదు. ఏ రోగాన్నయినా క్షణాలమీద ఆ వుధృతాన్ని తగ్గించలేడు. యే డాక్టరయినా అసలు అలా తగ్గించరు కూడాను. బాబు విషయంలో కూడా అదే జరిగింది.

కాని, జానకి మనసులో దాగుని వున్న వికృతభావం, వింత అర్ధం తీసింది. బాబును చూసి, భార్యలానే డాక్టరు కూడా అసూయపడుతున్నాడేమో ననుకుం దామె. ఆమెలో ఆ సంకుచిత భావం యెలా వుద్భవించిందో, ఆ భగవంతునికే తెలియాలి.

ఆమెలో ఆ అభిప్రాయం పొడచూపిందే తడవుగా భర్తతో చెప్పింది. "మరో డాక్టర్ని తీసుకొచ్చి చూపిస్తే బాగుంటుందేమోనండీ! నాకు యెందుకో భయంగా వుంది" అని.

రామమూర్తి భార్య మాటలకు ఆశ్చర్యపోయాడు. ఆమె కేసి కళ్ళప్పగించి చూశాడు. డాక్టర్ని మార్చే అవసరం అతనికి యేమీ కనిపించలేదు.

"అదేమిటి జానకీ! డాక్టర్ని మార్చడ మెందుకు? వేణు గారు యీ వూళ్లో ప్రసిద్ధికెక్కిన డాక్టరు. అతనికంటె మంచి వాళ్ళు యింకెవరున్నారని?" అన్నాడు.

"అతనికి పేరు ప్రతిష్ఠలు వుండొచ్చు. కాని యెందుకో, నాకు అతనిపట్ల నమ్మకం కుదరడంలేదు" అందామె ధైర్యం చేసి.

"కారణం?" వింతగా ఆమెకేసి చూస్తూ అన్నాడు రామ్మూర్తి.

జానకి తన అభిప్రాయాన్ని చెప్పడమా, మానడమా, అని తటపటాయించింది. చివరికి చెప్పాలనే నిర్ధారణచేసుకుంది.

"వేణుగారు మంచివారేనండీ? అతనికి పెద్ద పేరుంది నేను కాదనను. కాని అతని భార్యకి మన బాబంటే అంత రంగంలో అసూయగా వుంది. ఆ అసూయనే ఆమె భర్తలో ప్రేరేపించిందేమో! అందుకే ఆయన అంత శ్రద్ధ తీసుకోలేదని పిస్తుంది." వెనుకా ముందూ ఆలోచించకుండా అనేసింది.

రామ్మూర్తికిమతిపోయినట్టయింది. తనుయేమిటి వింటు న్నాడు? జానకి యింత దురభిప్రాయానికి యెలా తావిచ్చింది?

"అసూయా? నీ కేమన్నా మతిపోయిందా యేమిటి?" మెల్లగా అన్నాడు కోపాన్ని అణచుకొంటూ.

"నా కేమీ మతి పోలేదండీ! నా మాట నమ్మండి! మన బాబు ముచ్చటగా వుంటాడు. మంచి మంచి బట్టలు వేసు కుంటాడు. ఆ మధ్య ఓసారి వీడి మెళ్ళోని బంగారుగొలుసు,

చేతికున్న చెయినూ చూసి, ఆమె అదోలాంటి విషపునవ్వు నవ్వేందంటే, మీరు నమ్మరు. ఆమె అసూయ పడ్డానికి యివే గాక యింకా అనేక కారణాలు వున్నాయిలెండి."

రామ్మూర్తి భారంగా నిట్టూర్పు విడిచాడు. భార్య అభిప్రాయం, కేవలం అపోహతో కూడిన దేనని అనుకున్నాడు.

"నువ్వు యీ విధమైన సంకుచిత భావం యేర్పర్చుకోవడం, యేమీ బాగులేదు జానకీ! బాబుపట్ల రమాదేవికి అమిత వాత్సల్యం వుంది. వేణుగారుకూడా అంతేను. అలాంటి సహృదయులైన దంపతులను నువ్వు అపార్థం చేసుకుంటున్నావంటే, అది నీ సంకుచితత్వాన్నే వెల్లడిచేస్తుంది" అన్నాడు.

"స్త్రీల మనస్తత్వం మీకేం తెలుస్తుందండీ: రమకి సంతానం లేదుగా! ఇదో విధమైన అసూయ అందుకే ఆమె ప్రభావం డాక్టరులో వుంటుందేమోనని మార్చమంటున్నాను. ఎంత డబ్బయినాసరే ఫరవాలేదుగాని, మరో డాక్టర్ని తీసుకురండి" అంది జానకి.

భార్యపై చెప్పలేనంత కోపం వచ్చింది రామ్మూర్తికి. కాని, ఆ పరిస్థితుల్లో తను మొండిగా ప్రవర్తిస్తే పరిణామం యెట్లా వుంటుందో వూహించుకోలేకపోయాడు. డా. వేణుని మార్చడమంటే, యితనికి యెందుకో మనస్సు విలవిల కొట్టుకుంటోంది. డాక్టర్ వేణు సహృదయుడు. పేరు ప్రతిష్ఠలున్నవాడు. అటువంటివాణ్ని యేకారణంచెప్పి మార్చడం? ఇదే సందిగ్ధంలోపడి ఓరోజంతా గడిపాడు. అవుతే, జానకి ప్రోద్బలం

హెచ్చవడంతో తన మనసుకి వ్యతిరేకంగా వేణుదగ్గరికి వెళ్ళాడు.

"వేణుగారూ!" అని ప్రారంభించాడేగాని యెలాచెప్ప డమా అని మళ్ళీ ఆగిపోయాడు.

"ఆగిపోయారేం రామ్మూర్తిగారూ చెప్పండి" వేణు అడిగాడు

"మరేం లేదండీ! డా. శంకరంని తీసుకొచ్చి బాబుని చూపించమని చాలామంది స్త్రీలు మా ఆవిడకు సలహా యిచ్చారుట. మీరు..." అంతవరకే అనగలిగి మొహం దించుకున్నాడు. సంస్కారంగల యేవ్యక్తీ అలా చెప్పలేడేమో నన్పించి, తనపై తనే అసహ్యించుకున్నాడు. కాని, యేం చేస్తాడు? పరిస్థితికి బానిస అయ్యాడు.

డా. వేణు క్షణంసేపు స్తబ్ధుడయ్యాడు. రామ్మూర్తి అలా అనడంలో తన ప్రతిభకు, అభిమానానికీ ఏదో ఘాతం తగిలినట్టుగా ఫీలయ్యాడు. అయితే, ఆ విషయం అతనితో వాదన పెట్టుకోలేదు. చిన్నగా మాత్రం నవ్వేడు. ఆ మంద హాసం వెనుక, యెంతటి బాధ దాగివున్నదో రామ్మూర్తి అర్థం చేసుకోగలిగాడు.

"దానికేం-అలాగే కానివ్వండి. ఆడవాళ్ళ అభిప్రా యాన్ని త్రోసిపుచ్చడం ఒక్కొక్కప్పుడు మనకే హానికరం. ఎటుపోయి యెటొచ్చినా, మనల్నే నిందిస్తారు" అన్నాడు నిరుత్సాహం కనబడకుండా!

"మీరు మరో విధంగా భావించకండి" అన్నాడు నవ్వుతూ.

రామ్మూర్తి వెళ్ళిపోయాడు అక్కణ్నించి. అతనికి డాక్టర్ వేణు మంచితనం పిచ్చెక్కించింది. భార్యమీద అమితమైన కోపం వచ్చింది కాని కోపం ప్రదర్శించవలసిన సమయం అదికాదనుకుని వూరుకున్నాడు.

* * *

డాక్టర్ మారాడు డా. శంకరంకూడా మంచివాడే. అందుకేనేమో, తనని తప్పిస్తున్నా, వేణు ఏమీ అనలేదు. వాళ్ళకోరికను ఎందుకు కాదనాలని ఒప్పుకున్నాడు. అంతే గాని, దీని వెనుకగల కారణంకోసం ఆరా తీయలేదు. రమకి కూడా యీ మార్పు ఏమంత నచ్చలేదు. "శంకరం మీకంటె ప్రతిభగల డాక్టరేమిటండీ?" అమాయకంగా ప్రశ్నించింది భర్తను.

డాక్టర్ వేణు చిన్నగా మందహాసం వెదజల్లాడు.

"డాక్టర్ల విషయంలో ప్రతిభ ప్రసక్తే వుండదు రమా? కేవలం కొంత అదృష్టంమీదే ఆధారపడి వుంటుంది. ఒక్కొక్క డాక్టరంటే, ఒక్కొక్కరికి అభిమానం. బాబు తల్లికి యెవరో శంకరం పేరు సజెస్ట్ చేశారట.... పోనీ, అలాగే కానీయ్. మనకేం? బాబు కోలుకోవడమే కదా మనంకూడా కోరుకునేది. శంకరంకూడా మంచిడాక్టరే" అన్నాడు వేణు.

రమ మరేం అనలేదు.

డా. శంకరం రామ్మూర్తి యింటికి వచ్చాడు. డా. వేణు రామ్మూర్తి పొరుగునే వుంటున్నట్లు చూసి

"మీ పొరుగునే సుప్రసిద్ధ డాక్టరు వుండగా, నన్ను రప్పించారేమిటండి?" అని ప్రశ్నించాడు.

సాధారణంగా డాక్టర్లలో ఐక్యత వుండటం చాలా అరుదు. అయినా శంకరం, వేణు మంచి స్నేహితులు. వాళ్ళిద్దరూ యే అరమరికలూ లేకుండా ప్రవర్తిస్తుంటారు. అందుకే శంకరం అలా అడిగాడు

రామ్మూర్తి మాత్రం యేం జవాబు చెప్తాడు? డాక్టర్ శంకరమే కాదు - యెవరైనా ఆ ప్రశ్నే వేస్తారు.

"మా వాళ్ళకి యెవరో మీ పేరు చెప్పారట-అందుకే మిమ్మల్ని పిల్చాను." అబద్ధం చెప్పాల్సివచ్చింది రామ్మూర్తికి. శంకరం మరేమీ అనలేదు.

డా. శంకరం ట్రీట్‌మెంటు మూడురోజులు సాగింది. అయినాసరే, బాబు యేమీ కోలుకోలేదు. పైగా బాబు పరిస్థితి కాస్తంత ఆందోళనకరంగా అయ్యింది

"ఈ డాక్టరువచ్చి యేంచేశాడు?" కోపంగానే అన్నాడు రామ్మూర్తి భార్యను వుద్దేశించి.

"అనుకోగానే తగ్గుముఖం పడుతుందటండీ? క్రమంగా తగ్గుతుందిగా" అంటూ తనని తను సమర్థించుకోవడానికి ప్రయత్నించింది జానకి.

"ఈ జ్ఞానం డాక్టర్ వేణుగారి విషయంలో లేకపోయిందిగా మోసు! ఎవరితప్పును వారు సమర్థించుకోవడానికి ప్రయత్నించడం సహజం మరి" విసురుగా అన్నాడు.

జానకి నోటికి తాళం పడింది.

మరో రెండు రోజులు గడిచాయి. బాబు పరిస్థితి క్లిష్టంగా తయారయింది, డా. శంకరంకి యీ కేసు ఒక అగ్ని పరీక్షలా యెదురయింది. నిశ్చితంగా ట్రీట్ మెంటులో ముందుకుసాగలేక పోయాడు. అటువంటిపరిస్థితుల్లోతోటిడా.తో సంప్రతించడం ప్రతి డాక్టరికీఅవసరం. అది కొందరు పాటిస్తారు కొందరుతమప్రతిష్టకు భంగకరమే మోననివిస్మరిస్తారు. డా.శంకరం మాత్రం తనకర్తవ్యాన్ని గుర్తించి, వెంటనే డా. వేణు దగ్గరికి వెళ్ళాడు. డా. వేణు యిటీవల బాబు పరిస్థితి శంకరం ద్వారా తెలుసుకుని గాభరా పడ్డాడు. తనని మాన్పించారన్న అవమానం గాని, క్రోధంగాని, అతనిలోలేదు. నిజానికి డాక్టరు వృత్తిలో వీటికి చోటుండకూడదు. శంకరంతోకలిసి, వెంటనే రామూర్తి ఇంటికి వెళ్ళాడు.

డా. వేణుని చూసి, రామ్మూర్తి స్తంభించి పోయాడు. సిగ్గుతో అతని మొహం పాలిపోయింది. హృదయంలో యేదో తెలియనిబాధ రగిలింది. వేణుగారి సహృదయతను మనసులో కొనియాడాడు.

డాక్టర్లు యిద్దరూ బాబుని క్షుణ్ణంగా పరీక్షించి, క్షణం సంప్రదింపులతో ఒకనిర్ణయానికి వచ్చారు. డా. శంకరం ఓ యింజక్షను యిచ్చాడు. కొన్ని మాత్రలు కూడా ఇచ్చాడు.

“అబ్బాయికి యేమీ ప్రమాదం లేదుకదండీ వేణు గారూ ?” ఆతృతగా అన్నాడు రామ్మూర్తి.

డా. వేణు రామ్మూర్తి భుజం తడుతూ,

"మరేం ఫరవాలేదు లెండి" అనేసి వెళ్ళిపోయాడు శంకరంతోపాటు.

వాళ్ళు వెళ్ళిపోయాక రామ్మూర్తి భార్యనుద్దేశించి అన్నాడు "చూశావా జానకీ-మనం పిలువక పోయినా తనకి జరిగిన అవమానాన్ని సహితం మర్చిపోయి శంకరంగారు రమ్మనగానే డా. వేణు వచ్చారు. అతని సహృదయాన్ని యిప్పుడైనా అర్థంచేసుకో! శంకరంగారు అతనితో సంప్రదించడం తప్పనిసరి అయిందిగా. ఆ డాక్టర్నే మనం అపార్థం చేసుకున్నాం." అతనిగొంతులో కరకుదనం కొట్టొచ్చినట్టు కనిపించింది.

"స ప్రదించడమేమిటండీ! ఇద్దరూ స్నేహితులుగా మోసు-కలిసివచ్చారు" నిర్లక్ష్యంగా అంది జానకి.

ఆమె నిర్లక్ష్యంచూసి రామ్మూర్తికి కోపం ఉప్పెనలా వచ్చింది అవుతేనేం. ఆకోపాన్ని ప్రదర్శించే తరుణం ఇది కాదనిపించింది "నీకు యింతే తెలుసులే" అనేసి బైటికినడిచాడు.

* * *

మూడోనాటికి బాబు కాస్త కోలుకున్నాడు. రామ్మూర్తి దంపతులు తృప్తిగా నిట్టూర్చారు. వారి హృదయాల్లో యింతవరకూ అవ్యక్తంగా దోబూచులాడిన భయం పటాపంచలయింది.

"ఇక మీ అబ్బాయికి యేమీ భయంలేదు లెండి" అన్నాడు డా. శంకరం.

"మీ ఋణం తీర్చుకోలేమండీ!" అన్నాడు రామ్మూర్తి కృతజ్ఞతాపూర్వకంగా.

"కృతజ్ఞత తెలుపవల్సింది నాకుకాదండి మీ పొరుగాయన డా. వేణుకు. ఆయనతో ఆ క్లిష్టసమయంలో సంప్రదించకపోతే నేను యేంచేసేవాణ్నో చెప్పలేను. అయినా, డా. వేణుగార్ని యింటిప్రక్కనే పెట్టుకుని, నన్ను పిలవటం మీకు భావ్యంగా లేదు. డాక్టరుగానే నలా చెప్పకూడదనుకోండి. కాని, మేమరువురం మిత్రులంగా బట్టి చెప్తున్నాను, మీరు మరోవిధంగా అనుకోకండి వస్తామరి. అబ్బాయి విషయంలో మీరేమీ యింక భయపడొద్దు" అంటూ నిష్క్రమించాడు డా. శంకరం. అతనికి పాపం పూర్వగాథంతా తెలీదు.

రామ్మూర్తి, డాక్టర్ని సాగనంపి లోపలికివచ్చాడు సరాసరి. భార్యదగ్గరికి పోయి ఆమెకేసి తీక్ష్ణంగా చూస్తూ. "శంకరంగారు చెప్పినదంతా విన్నావుగా జానకీ! మన బాబుని రక్షించిందెవరో యిప్పుడైనా తెలుసుకున్నావా? అనవసరంగా అపోహ:పడి యింతవరకూ తెచ్చిపెట్టావు. సహృదయులైన వేణు దంపతులకు యెట్లా మొహాలు చూపిస్తాం? వాళ్ళకి ఏ విధంగా క్షమాపణ చెప్పుకొంటాం? ఛీ! ఛీ! ఆడవాళ్ళ సంకుచితత్వానికి హద్దులు లేవని చెప్పడానికి నువ్వొక నిదర్శనం, అందరూ నీలాంటివారు కాదుగనక సరిపోయిందిగాని, లేకుంటే లోకం భగ్గున మండిపోయేది. ఇకనైనా నీ మనస్తత్వాన్ని మార్చుకుంటే, శ్రేయస్కరం" కటువుగానే అన్నాడు.

జానకి మాత్రం యేమంటుంది? తనదే తప్పని తెలుసుకుందిగా మోసు, మౌనంగా మొహం దించుకుంది!